నిరుపేదలకు అండగా మున్నూరు కాపు సంఘం



ఆర్థిక సాయం అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

అడ్డగుట్ట: నిరుపేద మున్నూరు కాపు కులస్తులకు అండగా ఉంటామని సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిసెట్టి హనుమంతురావు అన్నారు. రెండు కిడ్నీలు పాడైపోయి చికిత్స చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా సంధ్య అనే మహిళకు మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కాచిగూడ మున్నూరు కాపు మహాసభ తరఫున రూ.30 వేలు, తోట రఘునాథ్ రూ. 50 వేలు, సికింద్రాబాద్ కాపు సంఘం నుంచి రూ. 50 వేలు మొత్తం రూ. 1.30 లక్షల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంప చంద్రమోహన్, మణికొండ వెంకటేశ్వర్‌రావు, తెలంగాణ మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు తోట రఘునాథ్, లక్ష్మణ్, అనిల్, రామారావు, శ్రీనివాస్, చందు, రాచూరి లక్ష్మి, నీలి జ్యోతి, మదన్ మోహన్, శ్రీకాంత్, శ్రీకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

టైపిస్టు ఉద్యోగాలను పునరుద్ధరించాలి



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న మహ్మద్ మసూద్ అలీ, నిరుద్యోగులు

లాలాపేట: టైపిస్టు ఉద్యోగాలను పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్, నిరుద్యోగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం టైప్ రైటింగ్ ఉద్యోగాలను తీసివేయడంతో టైపు రైటింగ్ నేర్చుకున్న దాదాపు 4 లక్షల మంది నిరుద్యోగులుగా మిగిలారన్నారు. పక్కరాష్ట్రాలు కర్నాటక, తమిళనాడులో టైప్‌రైటింగ్ సర్టిఫికెట్స్ ఉంటేనే కంప్యూటర్‌లో ఇన్‌పుట్ సమర్థవంతంగా, వేగవంతంగా ఉంటుందని భావించి టైపు రైటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ సైతం ఆ పద్ధతిని అవలంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. కలిసిన వారిలో తెలంగాణ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మసూద్ అలీ, బాతుల ప్రశాంత్, గిరీశ్, ప్రదీప్, టైపిస్టు నిరుద్యోగులు అనిల్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న డీవైఎస్‌వో అధికారి సుధాకర్ తదితరులు

రసూల్‌పురా: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నదని హైదరాబాద్ జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి సుధాకర్ తెలిపారు. ఒలింపిక్ డే రన్ సందర్భంగా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఆదివారం ఒలింపిక్ జ్యోతి వెలిగించి ఒలింపిక్ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హకీంపేట స్పోర్ట్స్ అకాడమీలో క్రీడాకారుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ మాట్లాడుతూ యేటా కంటోన్మెంట్ నుంచి స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ క్రీడాకారులు, కోచ్‌లు, వివిధ పాఠశాలల విద్యార్థుల భాగస్వామ్యంతో ఎల్‌బీస్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రభుకుమార గౌడ్, జంపన రవి, రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, నాగరాజు, అరుణ్ యాదవ్, శశి, వివిధ క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావును కలిసిన బీఆర్ఎస్ నేతలు



పద్మారావు గౌడ్‌తో బీఆర్ఎస్ నేతలు

లాలాపేట: బీఆర్ఎస్ నేతలు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న బోనాల వేడుకలకు ప్రభుత్వ పరంగా నిధులు సకాలంలో మంజూరు చేయించాలని కోరారు. అలాగే స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుడు హన్మంత్‌రావు జన్మదిన సందర్భంగా పద్మారావు గౌడ్ సమక్షంలో కేక్ కట్ చేశారు. పద్మారావు గౌడ్‌తో పాటు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో సీనియర్ నాయకులు ఏ చంద్రశేఖర్, బలరాం, దయానంద్ తదితరులు ఉన్నారు.

టీఎస్ ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ అధ్యక్షుడిగా మల్లేశ్



నియామక పత్రం అందుకుంటున్న గడ్డం మల్లేశ్

అడ్డగుట్ట: టీఎస్ ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ అధ్యక్షుడిగా అడ్డగుట్టకు చెందిన గడ్డం మల్లేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నాడు. అదే విధంగా ప్రధానకార్యదర్శిగా చిప్పలపల్లి పరశురాం, కార్యదర్శిగా కుర్రల వెంకటేశ్‌తో పాటు కమిటీ సభ్యులను నియమించారు. మాదిగ జాతి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని, రిజర్వేషన్ల సాధనకు కులస్తులందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తానని అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పసులాది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



లాలాపేట: డీఎఫ్ఎస్ఎస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని అనాథాశ్రమంలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఆదివారం టెక్స్ట్, వర్క్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీపక్ వర్మ, నజీబ్, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

స్థలం కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు అంధురాలి వినతి

రహమత్‌నగర్: ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకుని, తన స్థలాన్ని కాపాడాలని ఓ దివ్యాంగురాలు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. వివరాలివీ... ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన చంద్రమ్మ అలియాస్ కృష్ణవేణి చిన్నపటి నుంచే అంధురాలు. ఆమెకు 1993లో అప్పటి ప్రభుత్వం 50 గజాల ఇంటి పట్టా (ఎఫ్.4477.93)ను మంజూరు చేసి, ప్లాట్ 89లో స్థలంలో కేటాయించింది. అయితే ఇదే బస్తీకి చెందిన వడ్డె ఎల్లయ్య తన స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. గతంలో కూడా పలుమార్లు తన స్థలం ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నం చేశారన్న విషయం ఆమె గుర్తు చేసింది. తన స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న ఎల్లయ్యపై చర్యలు తీసుకుని తన స్థలాన్ని కాపాడాలని చంద్రమ్మ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది.

పర్సనల్ ఫొటోలు వైరల్ చేస్తానంటూ బెదిరిస్తున్న భర్తపై ఫిర్యాదు

వెంగళరావునగర్: భార్య నగ్న ఫొటోలను వైరల్ చేస్తానంటూ బెదిరిస్తున్న భర్తపై ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. యూసుఫ్‌గూడలో నివసించే మహిళకు రామాంతపూర్‌కు చెందిన వి.రాజేష్‌తో షాదీ డాట్ కామ్‌లో పరిచయమైంది. ఈ క్రమంలో గత ఏడాది మార్చి 11న వివాహమైంది. రాజేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారి పెళ్లికి అతని తల్లి మినహా బంధువర్గం ఎవరూ హాజరుకాలేదు. వాస్తవానికి అతనికి రెండు పెళ్లిళ్లు అయ్యాయి. నిత్యం డేటింగ్ యాప్‌లో యాక్టివ్‌గా ఉంటూ లింగ బేధం లేకుండా అనేక వ్యవహారాలు కొనసాగించాడు. ఆమె అనుమతి లేకుండా అసహజ సెక్స్‌లో పాల్గొనేవాడు. అత్త కట్నం కోసం వేధించేది. అతనిపై వెస్ట్‌జోన్‌లో కేసు కూడా పెట్టింది. తాను చివరిసారిగా కోర్టుకు హాజరైనప్పుడు తన ఫోన్‌లో భార్య న్యూడ్ ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, కేసు ఉపసంహరించుకోకపోతే వాటిని వైరల్ చేస్తానని బెదిరించాడు. కేసు ఉపసంహరించుకోవాలని, లేకపోతే చనిపోవాలని హెచ్చరిస్తున్నాడు. దాంతో మధురానగర్ పీఎస్‌లో రాజేష్‌మీద అతని భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



లాలాపేటలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



అన్నపూర్ణ మెస్ వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని నెహ్రూ పార్కు వద్ద డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు దయానంద్, మూల రవీందర్, లింగంపల్లి నర్సింగరావు, వెల్లాల రామ్మోహన్ హాజరై శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు ఉండద్దనే నినాదంతో ఆర్టికల్ 370 రద్దు కోసం శ్యామాప్రసాద్ ముఖర్జీ ఉద్యమించారన్నారు. జనసంఘ్ అధ్యక్షుడిగా పోరాటం చేసి అరెస్టు అయ్యి బలిదానం అయ్యారన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన త్యాగాలను నేటితరానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. 75 ఏళ్ల తర్వాత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఆయన లక్ష్యం నెరవేరిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకుమార్, నరేశ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వరప్రసాద్, శివ, రాజు, చారి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లో..

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని అన్నపూర్ణ మెస్ వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నేతి సత్యానారాయణ, భాస్కర్‌గౌడ్, సురేశ్, సంపత్, సుధాకర్‌గుప్తా, ఆర్‌వీ. రమణ, ఓములు, పాండు, రాజ్‌కుమార్, సుబ్బారావు, రాజు, పద్మారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట జయశంకర్ స్టేడియం వద్ద..

లాలాపేట: లాలాపేటలోని జయశంకర్ స్టేడియం వద్ద తార్నాక బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటేశ్‌గౌడ్, నవీన్, ఉపేందర్ యాదవ్, గండికోట నర్సింహ, సుబ్బారావు, శ్రీనివాస్‌చారి, ప్రకాశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు ఆమరణ నిరాహార దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–2,3, డీఎస్సీతో పాటు వివిధ శాఖల్లో ఉద్యోగాల సంఖ్య పెంచాలని ఈ నెల 24న (నేడు) ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఉద్యోగాల ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని విద్యార్థి నేత మోతీలాల్ డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే దీక్షకు పోటీ పరీక్షల బోధకుడు అశోక్ పాల్గొననున్నట్లు తెలిపారు.

నిధుల కేటాయింపుపై హర్షం



గుర్రం పవన్‌కుమార్

అడ్డగుట్ట: సికింద్రాబాద్, హైదరాబాద్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించడంపై లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బోనాలకు రూ. 25 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరామని పేర్కొన్నారు. దీంతో మంత్రి ఇటీవల జరిగిన బోనాల పండుగ సమీక్షా సమావేశంలో సంబంధిత మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సీఎం ద్వారా నిధులు కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల పేద విద్యార్థులు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ కోరినట్లు ఆయన గుర్తు చేశారు. అయితే కోతలు లేకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని ఆయన కోరారు.

ప్రథమ వర్ధంతి

రసూల్‌పురా: బీఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు బి. ప్రభాకర్ ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మూడో వార్డు పరిధిలోని అన్నా నగర్, కార్ఖాన, మడ్‌ఫోర్ట్ డబుల్ బెడ్రూం, బాలంరాయి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రభాకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట: రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండిలోని 'బి' క్యాబిన్ సమీపంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో సుమారు 65–70 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు వారు తెలిపారు.

శంకర్ యాదవ్ సేవలు మరువలేనివి



శంకర్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



శంకర్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్: తలసాని శంకర్ యాదవ్ సేవలు మరవలేనివని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ వర్తకుడు, కార్మికుల సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మరణించగా, ఆయన జ్ఞాపకార్థం సోదరుడు నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ముందుగా శంకర్‌యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికులకు అన్నివేళలా శంకర్ యాదవ్ అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మార్కెట్ కమిషన్ ఏజెంట్‌ల సంఘం అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, గిరిధర్, తలసాని శంకర్ యాదవ్ సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తలసానిని పరామర్శించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

రాధికా కాలనీలోని శంకర్ యాదవ్ నివాసంలో శంకర్ చిత్రపటం వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాళులర్పించారు. మోండా మార్కెట్ వ్యాపారులు, హమాలీల సంక్షేమానికి శంకర్ యాదవ్ ఎంతో కృషి చేశాడని మంత్రి కొనియాడారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు వారి మాతృమూర్తి లలితాబాయి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

'అల్ఫా హోటల్‌పై అసత్య ప్రచారం'

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని అల్ఫా హోటల్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఆ హోటల్ యాజమాన్యం కోరింది. ఆదివారం ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ఫుడ్ సెఫ్టీ అధికారులు తమ హోటల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు మాత్రమే చేశారన్నారు. ఇదే సమాచారాన్ని ట్విట్టర్‌లో పోస్టు పెట్టారని, అయితే దానిని అసరాగా చేసుకుని ఇతర హోటల్స్‌లోని అపరిశుభ్రమైన కిచెన్ ఫొటోలను జోడించి అవి అల్ఫా హోటల్ కిచెన్‌గా చూపిస్తూ నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్నట్లు కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు రాశాయని వాపోయారు. రోజుకు 80 వేల మంది ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని, చరిత్ర గల తమ హోటల్‌పై తప్పుడు కథనలు రాసి నిందలు వేయొద్దని కోరింది.

అంత్యక్రియల్లో రెండు గ్రూపుల మధ్య గొడవ

అడ్డగుట్ట: అంత్యక్రియల్లో రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే..అడ్డగుట్ట డివిజన్‌లోని శాస్త్రినగర్‌కు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. ఆదివారం సాయంత్రం మారేడుపల్లిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ దగ్గర ఉన్న వైన్‌షాపు వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న బలరాం, అతని స్నేహితుడు బయటకు వచ్చి ఎలా చనిపోయాడని అంత్యక్రియల్లో ఉన్న వ్యక్తిని అడిగాడు. అతను స్పందించకపోవడంతో బలరాం, అతని మరో స్నేహితుడు సదరు వ్యక్తిపై సీరియర్ అయ్యారు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. అంబేద్కర్‌నగర్ నుంచి 15 మంది వచ్చి శాస్త్రినగర్ వాసులపై దాడికి పాల్పడగా ఒకరు స్పృహ కోల్పోయారు. దీంతో అందరూ అక్కడి నుంచి పరారయ్యారు. క్షతగాత్రుడిని వెంటనే చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అంబేద్కర్‌నగర్‌కు చెందిన బలరాంను అదుపులోకి తీసుకున్నారు. దాడికి పాల్పడిన మిగితా వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

ఎంబీఏ విద్యార్థులకు మంచి అవకాశాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేటి పోటీ ప్రపంచంలో ఎంబీఏ విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని ప్రముఖ నేపథ్య గాయకుడు ప్రభు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో 2022–24 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు పార్టీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభు మాట్లాడుతూ.. క్రమశిక్షణ పట్టుదల ఉంటే అసాధ్యమంటూ ఏది లేదన్నారు. ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో తట్టుకోవాలంటే నిరంతర అధ్యాయం, నైపుణ్యత అవసరమని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ కో- ఆర్డినేటర్ సునంద, ప్రిన్సిపాల్ నాగరాజు, డైరెక్టర్ రిషికాంత్, కళాశాల కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవుల సంక్షేమానికి కృషి

నల్లకుంట : చాత్తాద శ్రీవైష్ణవ బంధువుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంట నర్మదా భవన్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం పాలకమండలి సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, నీలా వెంకటరమణ, తిరునగరి విష్ణు చిత్తస్వామి, పాండు, రవీందర్, అయ్యగారి ప్రభాకర్, జనార్దన్ స్వామి వివిధ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి వార్షికోత్సవాలు షురూ



అమ్మవారికి చేసిన ప్రత్యేక అభిషేకం

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి అమ్మవారి అష్టాదశ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమైనట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు క్షీరాభిషేకం, విఘ్నేశ్వర, దీక్ష దారణ, కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 3 గంటలకు గణపతి నవగ్రహ సహిత అవాహిత దేవత హోమాలు, సాయంత్రం ప్రదోశకాల పూజలు, నీరాజనం, మంత్ర పుష్పములు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు లక్ష పుష్పార్చన, మధ్యాహ్నం 3 గంటలకు చండీహోమం, 25వ తేదీన పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతీ ఆశీస్సులతో మహా పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

'పాట్నా హైకోర్టు తీర్పుతో బీసీలకు నష్టం'



సమావేశంలో మాట్లాడుతున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక రిజర్వేషన్లు రద్దు చేస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో బీసీలకు నష్టమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లకు అనుకూలమైన తీర్పు ఇచ్చిన కోర్టులు బడుగుల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం తగదన్నారు. ఎలాంటి గణంకాలు లేకుండా కమిషన్ సిఫార్సులు లేకుండా 10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీహార్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా పాట్నా కోర్టును పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో విక్రం, మనిమంజరి, ఇంద్రమ్, తారా, గుంటి మహేశ్ పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



అశోక్ యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధ్యాపక నియామకాలు చేపట్టకుండా, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వ వర్సిటీలను నిర్లక్ష్యం చేసి 11 ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. 6 వేలకు పైగా ప్రభుత్వ స్కూల్స్ మూతపడ్డాయని నాడు ప్రతి పక్షనేతగా విమర్శించిన రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి, వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టారాజ్యాంగా ఫీజులు, డొనేషన్లు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

సైకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

పద్మారావునగర్: సైకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 255వ అన్నదాన కార్యక్రమాన్ని సినీ నటుడు గౌతం రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎంతోమంది నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారని వారి సౌకర్యార్థం ఫౌండేషన్ వారు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వై. సంజీవకుమార్, పావనీ, నేహా, రోష్ని అఖిల్, ఇఫ్రాన్, జతిన్, శుభం పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.59, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 60, క్యాప్సికం 70, పచ్చకాకర 55, పందిరి బీర 45, క్యాబేజీ 28, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 33, దోసకాయ 23, రూట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చెట్ల కొమ్మల తొలగింపు

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ ప్రధాన రహదారిపై పడి ఉన్న చెట్ల కొమ్మలను ట్రాఫిక్ పోలీసులు ఆదివారం తొలగించారు. చెట్ల కొమ్మలు విరిగిపడిపోవడంతో రెండు రోజులుగా వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అయినా ఫలితం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు డిజాస్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి సమాచారం ఇచ్చి కొమ్మలను తొలగించారు. దీంతో ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డుపై చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు